## గ్రామ పంచాయతీల పెండింగ్ విద్యుత్ బిల్లులు మాఫీ చేయాలి: మండల సర్పంచుల ఏకగ్రీవ తీర్మానం



**దశ, కథలాపూర్ :** గ్రామ పంచాయతీలపై పేరుకుపోయిన పెండింగ్ విద్యుత్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా మాఫీ చేయాలని కోరుతూ కథలాపూర్ మండల సర్పంచులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. పంచాయతీల ప్రస్తుత ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ బిల్లుల భారాన్ని స్థానిక సంస్థలపై మోపడం సరికాదని వారు పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలకు ఇప్పటికే నిధుల కొరత తీవ్రంగా ఉన్నందున, పెండింగ్ విద్యుత్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వమే ప్రత్యేక గ్రాంట్ ద్వారా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఒకవేళ మాఫీ సాధ్యం కాకపోతే, గ్రామ పంచాయతీల జనరల్ ఫండ్ నిధులను విడుదల చేసి వాటి నుంచే బిల్లులు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, పెండింగ్ విద్యుత్ బిల్లులను గ్రామ పంచాయతీ నిధుల నుంచి చెల్లించాలని కార్యదర్శులపై ఎలాంటి ఒత్తిడి తీసుకురావద్దని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. గ్రామ పంచాయతీల ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం వెంటనే సానుకూల నిర్ణయం తీసుకుని పెండింగ్ విద్యుత్ బిల్లుల సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కథలాపూర్ మండల సర్పంచులు కోరారు.

## ఇంజాపూర్‌లో దిల్‌వార్‌ఖాన్ చెరువు పరిధిలో ఆక్రమణల తొలగింపు



**దశ, రంగారెడ్డి:** రంగారెడ్డి జిల్లా ఇంజాపూర్ గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 126లో ఉన్న దిల్‌వార్‌ఖాన్ చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్ (FTL) ప్రాంతంలో జరిగిన ఆక్రమణలను అధికారులు తొలగించారు. చెరువు FTL పరిధిని పరిరక్షించడంతో పాటు ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి విముక్తం చేసే చర్యల్లో భాగంగా ఈ తొలగింపు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. చెరువుల పరిరక్షణ, వర్షపు నీటి నిల్వ సామర్థ్యాన్ని కాపాడడం, భవిష్యత్తులో కొత్త ఆక్రమణలు జరగకుండా నిరోధించడం లక్ష్యంగా ఈ చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వ భూములు, చెరువుల FTL ప్రాంతాల్లో ఎలాంటి అక్రమ నిర్మాణాలు లేదా ఆక్రమణలను ఉపేక్షించబోమని హెచ్చరించారు.

## జెన్నరం కాలనీలో SIR హెల్ప్‌డెస్క్‌ను సందర్శించిన జీవన్ కుమార్ రెడ్డి



**దశ, అబ్దుల్లాపూర్‌మెట్:** అబ్దుల్లాపూర్‌మెట్ JNNURM కాలనీలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను వార్డ్ సభ్యుడు మొగుళ్ల జీవన్ కుమార్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఫారాలు నింపే విధానంపై అవగాహన కల్పిస్తూ, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా వివరాలు పరిశీలించి అవసరమైన సవరణలను సకాలంలో పూర్తి చేసుకోవాలని సూచించారు.

## 900 ఆన్‌లైన్ కోర్సులు పూర్తి చేసిన డా.రఘురామరెడ్డి ని ఎమ్మెల్యే అభినందనలు



**దశ ఓయూ:** హబ్సిగూడకు చెందిన 80 ఏళ్ల డా.నంద్యాల రఘురామరెడ్డి 900 ఆన్‌లైన్ కోర్సులను విజయవంతంగా పూర్తి చేసి అరుదైన ఘనత సాధించారు. ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పదవీ విరమణ అనంతరం కూడా నేర్చుకోవాలనే తపనతో డా .రఘురామరెడ్డి వందలాది ఆన్‌లైన్ కోర్సులను పూర్తి చేయడం అభినందనీయమన్నారు. ఈ అసాధారణ విజయానికి గుర్తింపుగా ఆయన పేరు 'బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో నమోదవడం గర్వకారణమని పేర్కొన్నారు. వయస్సు విద్యకు అడ్డంకి కాదని రఘురామరెడ్డి తన కృషితో నిరూపించారని, జీవితాంతం కొత్త విషయాలు నేర్చుకోవాలనే సంకల్పం ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తుందని ఎమ్మెల్యే అన్నారు. ఆయన సాధించిన ఘనత యువతతో పాటు అన్ని వయస్సుల వారిలో స్ఫూర్తిని నింపుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో హబ్సిగూడ మాజీ కార్పొరేటర్ బొమ్మగొని కైలాసపతి గౌడ్, హబ్సిగూడ డివిజన్‌కు చెందిన పలు కాలనీల అధ్యక్షులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఏఎస్ఎస్ తెలంగాణ రాష్ట్ర కో కన్వీనర్ ఆకారం రమేష్ నియామకం

**దశ, ఓయూ:** శబరిమల అయ్యప్ప సేవ సమాజం (ఎస్ఎస్ఎస్) జాతీయ స్థాయి సమావేశం చెన్నైలో జరిగింది. ఈ సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి నాయిని బుచ్చిరెడ్డి మాట్లాడుతూ, శబరిమలకు వచ్చే అయ్యప్ప భక్తులకు సేవ చేయడం మహాయజ్ఞమని అన్నారు. అన్నప్రసాద వితరణ, భక్తుల కనీస అవసరాలు తీర్చడం ద్వారా స్వామివారికి ప్రత్యక్ష సేవ చేసినట్లేనని పేర్కొన్నారు. ఈసారి యాత్రా సీజన్లో అన్నప్రసాద వితరణను మరింత పకడ్బందీగా, పరిశుభ్రంగా నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఆకారం రమేష్ను ఎస్ఏఎస్ఎస్ అయ్యప్ప అన్నదాన సేవా కేంద్ర రాష్ట్ర కో కన్వీనర్ గా నియమించారు. ఈ అవకాశం ఇచ్చిన జాతీయ ప్రధాన కార్యదర్శి నాయిని బుచ్చిరెడ్డికి ఆకారం రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. భక్తులకు నిస్వార్థ సేవ అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ నుండి కె. గోపాల్ రెడ్డి, సి.హెచ్. సిద్దన్న, జి. సాయి ప్రసాద్, అళ్ళెంకి సుదర్శన్, ఆకారం రమేష్తో పాటు ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.





# చౌటుప్పల్‌లో ఘనంగా వనమహోత్సవం

❖ మొక్కలు నాటిన చైర్‌పర్సన్ పావని రమేష్ గౌడ్.

**దశ, చౌటుప్పల్ :** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 2026-27 వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా చౌటుప్పల్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మంగళవారం 9వ వార్డు పరిధిలోని తిరుమల వెంచర్‌లో విస్తృత స్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటగా, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర నాయక్ కార్యక్రమానికి నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ, "వృక్షో రక్షతి రక్షితః" అనే సూక్తిని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించవచ్చని ఆమె అన్నారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర నాయక్ మాట్లాడుతూ, వనమహోత్సవం విజయవంతం కావాలంటే నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యతను ప్రతి ఒక్కరూ స్వీకరించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యమే విజయానికి మూలమని ఆయన పేర్కొన్నారు. వార్డు కార్యాలయ ప్రాంగణంలో నీడనిచ్చే, పూలను పూయించే పలు రకాల మొక్కలను నాటిన అనంతరం, వాటి సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజల భాగస్వామ్యంతో పచ్చదనాన్ని మరింత విస్తరించి పర్యావరణ పరిరక్షణను సామూహిక ఉద్యమంగా తీర్చిదిద్దాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, కౌన్సిలర్లు కోసనం రాకేష్ రెడ్డి, పోలేపల్లి లక్ష్మి ముత్తయ్య, పల్లె లావణ్య సురేందర్ రెడ్డి, ఊదరి యాదయ్య, కొయ్యడ శేఖర్, ఆలే శ్రీలత చిరంజీవి, బద్రి గాలయ్య, దేపా రమ్య రాజు, పాక చిరంజీవి, గడ్డం ఇందిర రాజరత్నం, చింతల ఉమా మహేశ్వరి సాయిలు, బుడ్డ సురేష్, పిల్లలమర్రి మధుసూదన్, హన్ను మహమ్మద్ , కోఆప్షన్ సభ్యులు పస్తం గంగారాములు, మహమ్మద్ బాబా షరీఫ్, షేక్ నబీబి, తిరుమల టౌన్షిప్ కాలనీ అధ్యక్షుడు మేడి రాములు, కాలనీవాసులు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, సానిటరీ ఇన్‌స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్, పర్యావరణ ఇంజనీర్ రేణు కుమార్ తదితరులు పాల్గొన్నారు.




## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి: ఏబీవీపీ

❖ రాష్ట్ర పిలుపుతో జిల్లాలో కళాశాలల బంద్ విజయవంతం

**దశ, రంగారెడ్డి:** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జిల్లాలోని యూనివర్సిటీలు, ఇంజినీరింగ్, డిగ్రీ, జూనియర్ కళాశాలల బంద్ విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగాఏబీవీపీరంగారెడ్డిజిల్లాకన్వీనర్‌పయ్యంశెట్టి జగదీష్ పటేల్ మాట్లాడుతూ, రాష్ట్రంలో సుమారు 20 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లపై ఆధారపడుతున్నారని, ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో రూ.11 వేల కోట్లకు పైగా బకాయిలు పేరుకుపోయాయని ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో లక్షలాది మంది విద్యార్థులు చదువులు మధ్యలోనే మానేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, 4.5 లక్షల మంది విద్యార్థులు సర్టిఫికెట్లు పొందలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల ప్రకారం పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేసి, గ్రీన్ ఛానల్ ద్వారా ఫీజులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విద్యార్థుల హక్కు అని, వాటి కోసం ఉద్యమిస్తున్న విద్యార్థులపై కేసులు నమోదు చేయడం, లాఠీచార్జీలు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని మండిపడ్డారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర, జిల్లా నాయకులు రుద్రపల్లి మహేందర్, ఢిల్లీ భాను, చింతల గుణవంత్ రెడ్డి, పుప్పాల ఆదర్శ్ పటేల్, శివా, కార్తీక్, నాని, భరత్ వంశీ, నవదీప్, విఘ్నేష్, చరణ్, ప్రేమ్ రాజ్, ప్రమోద్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## నాచారం డివిజన్‌లో శక్తికేంద్రాన్ని సందర్శించిన బీజేపీ జాతీయ కార్యదర్శి అల్కా గుర్జార్




**దశఓయూ:** నాచారం డివిజన్ పరిధిలోని SIR శక్తికేంద్రని బీజేపీ జాతీయ కార్యదర్శి, రాజస్థాన్ రాజ్యసభ సభ్యురాలు అల్కా గుర్జార్,ఉప్పల్ ఇంచార్జ్ నియోజకవర్గం BLA 1 పోతగాని గోపాల్ గౌడ్, పండిట్ దీన్ దయాళ్ సందర్శించారు. ఈ సందర్భంగా జాతీయ కార్యదర్శి, రాజస్థాన్ రాజ్యసభ సభ్యురాలు అల్కా గుర్జార్ కొనసాగుతున్న SIR ప్రక్రియను పలువురు BLA2లు, BLOలతో కలిసి ఆమె పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ మాజీ శాసనసభ్యులు NVSS ప్రభాకర్, రాష్ట్ర SIR ఇంచార్జ్ మర్రి శశిధర్ రెడ్డి, కో ఇంచార్జ్ వేముల అశోక్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయశ్రీ, జిల్లా అధ్యక్షులు మల్లారెడ్డి, జిల్లా SIR ఇంచార్జ్ నందనం దివాకర్, జిల్లా SIR సభ్యులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొరిగే కృష్ణ, SIR రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల నర్సింగ్ రావు, జిల్లా కిసాన్ మోర్చ ఉపాధ్యక్షులు రాగిరి మోహన్ రెడ్డి, జిల్లా ఓబీసీ మోర్చ కార్యదర్శి హన్మంత్ బిరాధర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు చంద్రమౌళి, డివిజన్ అధ్యక్షులు నవీన్ కుమార్, సీనియర్ నాయకులు యోగేశ్వర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, అన్వర్, మల్కా ప్రకాష్, ప్రతాప్ రెడ్డి, రాజి రెడ్డి, నవీన్ గౌడ్, నవీన్ చింటూ, వెంకట్ నాయక్, అనిత రెడ్డి, పోతగాని విజయలక్ష్మి, మంజులవాణి, వరలక్ష్మి, అరుణ, కళావతి, లావణ్య, పార్వతి, దీపిక జైన్ తదితర డివిజన్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలి

❖ జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ ను కలిసి కోరిన తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం ప్రతినిధులు..



**దశ, ఓయూ:** విద్యా ఉద్యోగ ఉపాధి, ఆర్థిక రంగాల్లో ఆదివాసులకు న్యాయం జరిగేందుకు వెంటనే రాష్ట్రంలో ప్రత్యేక ఎస్టి కమిషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ దిల్ కుష్ గెస్ట్ హౌస్ లో ఉన్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ ను సంఘ అధ్యక్షులు లోకిని రాజు నేతృతంలో ప్రతినిధుల బృందం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి త్వరగతినా ఎస్టీ కమిషన్ ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని హుస్సేన్ నాయక్ ను కోరారు. అనంతరం లోకిని రాజు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎరుకల సామాజిక వర్గం ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను జాతీయ ఎస్టి కమిషన్ సభ్యుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. రాజ్యాంగబద్ధంగా కల్పించాల్సిన హక్కులు, సంక్షేమ పథకాల అమలు, విద్య, ఉపాధి, ఇందిరమ్మ గృహాలు, ట్రైకార్ నిధులు, ప్రభుత్వ భూములు, సామాజిక న్యాయం, ప్రభుత్వ ఉద్యోగాలు రాజకీయ రంగాల్లో ప్రాధాన్యత కల్పించాలని కమిషన్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. అలానే పందులపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాల కోసం ఎరుకల ఎంపవర్మెంట్ స్కీంను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంకా అనేక విషయాలు అంశాలను కమిషన్ సభ్యుని దృష్టికి తీసుకెళ్లామని వారు కూడా సానుకూలంగా స్పందించి న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. కలిసిన వారిలో ఎం వి రమణ, కూతాడి రవికుమార్, కోనేటి నరసింహ, కేతిరి రాజయ్య, సుధాకర్, రవి తదితరులు పాల్గొన్నారు.

## మాణికేశ్వరి నగర్‌లో SIR హెల్ప్‌డెస్క్‌ను పరిశీలించిన ఆదం సంతోష్



**దశ, సీతాఫల్‌మండి:** సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని మాణికేశ్వరి నగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన SIR హెల్ప్‌డెస్క్‌ను సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి, కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం సంతోష్ పరిశీలించారు. ఆయన ఆదేశాల మేరకు డీసీసీ జనరల్ సెక్రటరీ గండికోట కుమార్ హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆదం సంతోష్ మాట్లాడుతూ, SIR ప్రక్రియలో ప్రజలకు అవసరమైన సహాయం అందించేందుకు హెల్ప్‌డెస్క్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఫారాలు నింపలేని వారికి అక్కడే ఫారాలు నింపి ఇవ్వడంతో పాటు, ఫారాలు అందని వారి వివరాలను ఆన్‌లైన్‌లో పరిశీలించి సంబంధిత BLO వద్ద అందుబాటులో ఉన్న సమాచారాన్ని ప్రజలకు తెలియజేస్తున్న గండికోట కుమార్, ఆయన బృందం సేవలను అభినందించారు. అనంతరం BLOలు, BLAలతో మాట్లాడిన ఆయన ఫారాల సేకరణను క్రమబద్ధంగా నిర్వహించాలని సూచించారు. అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని, SIR ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించి ఓటర్లకు అన్ని విధాలుగా సహకరించాలని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డీసీసీ జనరల్ సెక్రటరీ గండికోట కుమార్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## యూత్ కాంగ్రెస్ నేత వ్యాఖ్యలపై భగ్గుమన్న బీసీ సంఘాలు..

❖ జాతీయ రహదారిపై రాస్తారోకో

**దశ, ఎల్బీనగర్ :** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్పై రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ బీసీ సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ ఎల్బీనగర్‌లో జాతీయ రహదారిపై మంగళవారం రాస్తారోకో నిర్వహించి, శివచరణ్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. నిరసన సందర్భంగా బీసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ, మహిళా ప్రజాప్రతినిధిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా ఖండించదగ్గ విషయమని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం తక్షణమే స్పందించి, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ను డిమాండ్ చేశారు. అలాగే, శివచరణ్ రెడ్డి బహిరంగంగా క్షమాపణ చెప్పకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని, పెద్ద ఎత్తున రాస్తారోకోలు, ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. బీసీ సంఘాల నిరసనతో జాతీయ రహదారిపై సుమారు 10 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని నిరసనకారులను శాంతింపజేసి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.





# ఉప ముఖ్యమంత్రి, మంత్రుల పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి:** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, నీటిపారుదల మరియు పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో చేపట్టిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సీతమ్మసాగర్, సీతారామ ఎత్తిపోతల (లిఫ్ట్ ఇరిగేషన్) ప్రాజెక్టుల పరిశీలనతో పాటు నిర్వహించనున్న సమీక్ష సమావేశం ఎలాంటి అవాంతరాలు లేకుండా విజయవంతంగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అశ్వాపురం మండలం బీజీ కొత్తూరులో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ పనులను పరిశీలించిన కలెక్టర్, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా నిర్మాణాన్ని పూర్తి చేయాలని సూచించారు. హెలికాప్టర్ ల్యాండింగ్‌కు అవసరమైన భద్రతా చర్యలు, బారికేడింగ్, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వాహనాల పార్కింగ్, రాకపోకల ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు ఆదేశించారు.

అనంతరం అమ్మగారిపల్లి వద్ద నిర్వహించనున్న సమీక్ష సమావేశం ప్రాంగణాన్ని పరిశీలించి వేదిక, ప్రజాప్రతినిధులు, అధికారుల కూర్చునే ఏర్పాట్లు, మీడియా ప్రతినిధులకు సౌకర్యాలు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. సమావేశానికి హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రోటోకాల్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, విద్యుత్, వైద్య ఆరోగ్య శాఖలతో పాటు అన్ని సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో తమ బాధ్యతలను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ అంకిత్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక సాగునీటి ప్రాజెక్టుల పరిశీలన, సమీక్ష సమావేశం విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో అశ్వాపురం తహసీల్దార్ సూర్యప్రకాష్, నీటిపారుదల శాఖ, ఆర్ అండ్ బి శాఖ అధికారులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పినపాక ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఎన్నికైన చిట్టిమల్ల ప్రసాద్‌కు ఘన సన్మానం

❖ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి: మండల అధ్యక్షుడు పేరం వెంకటేశ్వర్లు




**దశ, పినపాక:** పినపాక మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన చిట్టిమల్ల ప్రసాద్‌ను పినపాక మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పేరం వెంకటేశ్వర్లు బయ్యారం క్రాస్ రోడ్డులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పేరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి, బలోపేతానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని సూచించారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రమించి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేరవేయడంలో ముందుండాలని పిలుపునిచ్చారు. ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిట్టిమల్ల ప్రసాద్ మాట్లాడుతూ, పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ శక్తివంచన లేకుండా పనిచేస్తానని తెలిపారు. ఎస్సీ సామాజిక వర్గాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని, వారి సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం నూతనంగా పినపాక మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన పేరం వెంకటేశ్వర్లును చిట్టిమల్ల ప్రసాద్ శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గంగిరెడ్డి వెంకటరెడ్డి, సర్పంచులు నాగకుమారి, స్వప్న, సమ్మయ్య, బాబురావు, చందర్రావు, భవతి, ఉమామహేశ్వరి, ఉపసర్పంచులు శిరీష, నరసమ్మ, మాజీ సర్పంచ్ తోలెం కళ్యాణి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల పిల్లలకు 50శాతం ఫీజు రాయితీ తప్పని సరిగా అమలు చేయాలి

❖ టీయూడబ్ల్యూజే(ఐజేయూ) పినపాక నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి, బర్ల జోషి



**దశ బూర్గంపాడు:** ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో 50శాతం ఫీజు రాయితీ తప్పని సరిగా అమలు చేయాలని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) పినపాక నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బర్ల జోషి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మండల విద్యావనరుల కేంద్రం లో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు జేవి రత్నం ఆదేశాల మేరకు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ప్రతినిధులు మండల విద్యాశాఖ అధికారి యదు సింహారాజుకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బర్ల జోషి మాట్లాడుతూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టుల కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అమలుకావాలని, అర్హులైన ప్రతి జర్నలిస్టు కుటుంబానికి ఫీజు రాయితీ అందేలా విద్యాశాఖ పర్యవేక్షణ చేపట్టాలని కోరారు. త్వరలోనే మండలం లోని అన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, జర్నలిస్టుల పిల్లలకు 50శాతం ఫీజు రాయితీ అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జిల్లా ఉపాధ్యక్షులు డొంకన చంద్రశేఖర్, ఎలక్ట్రానిక్ మీడియా డివిజన్ సహాయ కార్యదర్శి సాంబరెడ్డి, నియోజకవర్గ ఆర్గనైజింగ్ మెంబర్ నరసింహారెడ్డి, నియోజకవర్గ ఉపాధ్యక్షులు శివకుమార్, ఎలక్ట్రానిక్ మీడియా ఈసీ సభ్యులు రవి, సభ్యులు జక్కిరెడ్డి మల్లారెడ్డి, డి శ్రీనివాస్, కోటా రమేష్, రాంబాబు, చేతుల శ్రీనివాస్, సుధాకర్, ముజఫర్, కేసుపాక రాజు, తదితరులు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాల నివారణకే నాకాబందీ

❖ సీఐ చరమంద రాజు



**దశ హుజూర్‌నగర్ :** శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ రవాణా నాకాబంది నిర్వహించామని సిఐ చరమందరావు తెలిపారు. మంగళవారం హుజూర్ నగర్ పట్టణంలోని ఇందిరా చౌక్ వద్ద మంగళవారం విస్తృత వాహన తనిఖీలు నిర్వహించారు. ద్విచక్రవాహనాలు, కార్లు మరియు ఇతర రవాణా వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాల నివారణకు,అనుమానిత వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచేందుకు ఈ ప్రత్యేక నాకా బందీ తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు.వాహనదారులు తప్పనిసరిగా తమ వాహనాలకు సంబంధించిన ఒరిజినల్ పత్రాలను (లైసెన్స్, ఆర్సీ,ఇన్సూరెన్స్) కలిగి ఉండాలని స్పష్టం చేశారు. సరైన నంబర్ ప్లేట్లు, పత్రాలు లేని వాహన దారులపై జరిమానాలు విధించారు. కార్ల అద్దాలకు నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నల్లటి ఫిల్మ్‌లను తొలగించారు. డిక్కీలను,బ్యాగులను తనిఖీ చేస్తూ అనుమానాస్పద వస్తువుల రవాణాపై నిఘా పెట్టామన్నారు. ఈ తనిఖీల్లో భాగంగా 10 నెంబర్ ప్లేట్ లేని టూ వీలర్,15 ట్రిపుల్ రైడింగ్ 01 డ్రంకెన్ డ్రైవ్ మొత్తం 26 వాహనాలు సీజ్ చేశ్యామన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ నరేష్,మోతే పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రుల పర్యటన రద్దును కూడా రాజకీయంగా చూడటం సరికాదు: పేరం వెంకటేశ్వర్లు



**దశ, పినపాక:** మంత్రుల పర్యటన రద్దు అయిన విషయాన్ని కూడా రాజకీయంగా చూడటం బీఆర్ఎస్ నాయకులకు తగదని కాంగ్రెస్ పార్టీ పినపాక మండల అధ్యక్షులు పేరం వెంకటేశ్వర్లు తీవ్రస్థాయిలో విమర్శించారు. మంగళవారం పినపాక మండలం ఈ బయ్యారం క్రాస్ రోడ్డులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యటన రద్దుకు అనేక కారణాలు ఉండవచ్చని, ప్రతి విషయాన్ని రాజకీయ కోణంలో చూడడం సరైంది కాదన్నారు. మీ పార్టీ నాయకుల పర్యటనలు ఎప్పుడూ రద్దు కాలేదా అని బీఆర్ఎస్ నాయకులను ప్రశ్నించారు.ప్రజలు తిరస్కరించిన తర్వాత ఏం చేయాలో అర్థం కాక పనికిమాలిన ఆరోపణలు చేస్తూ ప్రెస్ మీట్లు నిర్వహిస్తున్నారని మండిపడ్డారు.కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతున్నాయని చెప్పారు.ఆ సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని, దానిని జీర్ణించుకోలేక బీఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించి, అనవసర విమర్శలు చేయకుండా ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు.

ప్రజల మధ్య ఉండి వారి నమ్మకాన్ని తిరిగి పొందేందుకు కృషి చేయాలని హితవు పలికారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అడ్డుకునే ప్రయత్నాలు మానుకుని నిర్మాణాత్మక రాజకీయాలు చేయాలని కోరారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి గంగిరెడ్డి శ్రీనివాస రెడ్డి, దిశా కమిటీ అధ్యక్షులు మద్దెల సమ్మయ్య, ఉప సర్పంచ్ ల సంఘం ప్రధాన కార్యదర్శి కోడం రాంమోహన్, గ్రామ పంచాయతీల సర్పంచులు, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా సంక్షేమ పథకాలు, ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి: పిరినాకి నవీన్

**దశ,మణుగూరు:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని ప్రతి గ్రామం, ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని కాంగ్రెస్ పార్టీ మణుగూరు మండల అధ్యక్షుడు పిరినాకి నవీన్ పిలుపునిచ్చారు. మణుగూరులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ వాటిని సద్వినియోగం చేసుకునేలా కృషి చేయాలని సూచించారు. అలాగే ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో కొత్త ఓటర్ల నమోదు, పేర్ల సవరణ, చిరునామా మార్పులు, తొలగింపులు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించి, ప్రతి అర్హుడు ఓటరుగా నమోదు అయ్యేలా పార్టీ శ్రేణులు పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హెచ్ పి వి వ్యాక్సిన్ మీ బిడ్డ భవిష్యత్తుకు రక్షణ కవచం

❖ గర్భకోశ క్యాన్సర్ నివారణకు వ్యాక్సిన్ తప్పనిసరి: డాక్టర్ నగేష్



**దశ, బూర్గంపాడు:** ఆడపిల్లల భవిష్యత్తు కోసం 14 సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లలకు హెచ్పివి వ్యాక్సిన్ రక్షణ కవచంగా కాపాడుతుందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ నగేష్ అన్నారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్పీవీ వ్యాక్సిన్ భూర్గంపాడు మండల కేంద్రంలో ఉన్న గురుకుల పాఠశాలకు చెందిన సుమారు 15 మందితో పాటు మరొకరికి వ్యాక్సిన్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఉన్న 14 సంవత్సరాలు వయస్సు కలిగిన బాలికలు తప్పకుండా హెచ్ పి వి వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. గర్భకోశ క్యాన్సర్ నివారణకు ఈ వ్యాక్సిన్ ఉపయోగపడుతుందని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా క్యాంపులు నిర్వహించి అందించడం జరుగుతుందన్నారు. మండల వ్యాప్తంగా ఉన్నటువంటి 14 సంవత్సరాల వయస్సు కలిగిన వారు ప్రతిరోజు మొరంపల్లి బంజర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో వ్యాక్సిన్ అందించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ప్రతి ఒక్కరు తమ ఆరోగ్యల విషయంలో నిర్లక్ష్యం చేయకుండా వ్యక్తిగత శుభ్రత పాటిస్తూ పరిశుభ్ర వాతావరణంలో ఉండే విధంగా ఎప్పటికప్పుడు ఆరోగ్య సూచనలు తీసుకుంటూ రోగాలను తరిమికొడదామని పిలుపునిచ్చారు. మొరంపల్లి బంజర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో వైద్య సేవలు కొనసాగుతూ ఉంటాయని గర్భిణీ స్త్రీలు ఉచిత కాన్పుల కోసం తమ సిబ్బందిని సంప్రదించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని కాన్పులు చేయబడతాయని పేర్కొన్నారు. సీజన్ సమయం కాబట్టి డెంగ్యూ ,మలేరియా, టైఫాయిడ్, వైరల్ ఫీవర్ వంటి జ్వరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎప్పటికప్పుడు ఇంటిలో ఇంటి, బయట వాతావరణం పరిశుభ్రంగా ఉంచుకొని నీళ్లు నిలబడకుండా ఉంచుకోవాలని సూచించారు. ఆరోగ్యమే మహాబలమని సంపద కూడా కొన్ని సందర్భాల్లో ఆరోగ్యాలను తీసుకురావని కేవలం వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనిత, సిహెచ్ ఓ విజయ, హెచ్ వి రమణ, ఏఎన్ఎంలు సుజాత, స్వాతి, గోపమ్మ, ఆశ వర్కర్లు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.